# లోకాస్సే మస్తా...

■ నంద చైతన్య



''మీ నాన్న ఉత్తరం రాసాడా'' అతని గొంతు కఠినంగా విన్పించింది. నాన్నను ఆయన ఏక వచనంతో సంబోధించటం నా దృష్టిని దాటిపోలేదు. ''ఇంకా రాలేదు'' అన్నాను ముభావంగా.

''ఛీ, ఛీ'' అన్నాడు విసుగ్గా శ్రీధర్... నా భర్త.

... ... ...

''అల్లుణ్ణి పండక్కి పిలవాలన్న ఇంగితజ్ఞానం కూడా లేదు'' ఇంకా అతని నోటి నుండి ఏం వినాల్సి వచ్చేదో గానీ ఈలోగా మా అత్తగారు రంగంలోకి ప్రవేశించారు. ''అంత ఇంగిత జ్ఞానమే వుంటే పెళ్లై పోయి రెండు సంవత్సరాలై పోతున్నా, ఇవ్వాల్సిన ఆ ఏభైవేలూ ఎపుడో మన మొహాన కొట్టేవాడు... వచ్చినపుడల్లా ఏవో కాకమ్మ కథలూ, కాని కష్టాలూ చెప్పేసి వెళ్ళిపోతాడు...'' ఆవిడ వాక్ప్రవాహం ఇక రాత్రివరకూ ఆగదు. నేను ఇక అక్కడ వుండలేక వంట గదివైపు పరుగెత్తాను వస్తోన్న కన్నీటినీ, రగుల్తోన్న గుండె మంటనూ ఆపుకొంటూ.

''చూసావా, చూసావా నువ్వూనేనూ ఇక్కడ ఇలా మాట్లాడుతూ వుంటె'' అది చూడు ఎలా వెళ్ళిపోతోందో...'' ఆయనలోని అగ్నికి ఆజ్యం రగిలిస్తోంది మా అత్తమ్మ.

''పోతుంది, పోతుంది- ఏకంగా పుట్టింటిలోనే వుంచేస్తే పీడా పోతుంది'' ఆయన మాటలు విన్పిస్తున్నాయి వెనుకనుండి.

''ఇంకా నయం, పీక నొక్కేస్తే ప్రాణంపోతుంది'' అని అన్లేదు-

ఏమో ఈయన తరహా రోజురోజుకూ మరీ క్రూరంగా మారిపోతోంది.

ఈ ఆర్నెల్లుగా చెయ్యిచేసుకోవటం, ఏం మాట్లాడినా పళ్ళు బిగించటం, కళ్ళు ఎర్రగా చెయ్యటం చేస్తున్నాడు.

నాలో కూడా 'ఆయన'అనుకొనే స్థాయి దిగజారిపోయి వా'డు', అని అనుకోవాల్సి వస్తోంది.

ఇద్దరిమధ్యా దూరం మరీ ఎక్కువైపోతోంది.

భార్యాభర్తల మధ్య ఉండాల్సిన ఆపేక్ష, అభిమానం ఆత్మీయత దూరమైపోయి వినిమయదారు, వినియోగదారుల మధ్య సంబంధంలా అయిపోయింది. నువ్వేంటి తెస్తావ్, నేనేంటి చెయ్యాలి.

నువు తెచ్చే ఏభైవేలతో నేను నిన్ను సిన్మాలకు షికార్లకు తిప్పుతాను, నువు తెచ్చే రూపాయలతోనే నీకు సుఖాల పరుపును తయారుచేస్తాను. నువు విసిరే నాణాల గలగల విన్నపుడే నేను నీతో నవ్వుతూ గలగలా మాట్లాడతాను.

అంతవరకూ ఇంతే, మూతి బిగించుకొని, మొహం చిట్లించుకొని ఒకే ఇంట్లో ఒకే గదిలో ఒకే మంచం మీద శత్రువుల్లా బ్రతుకుదాం అతని క్రూరమైన మనసు రాక్షస రూపం దాల్చి కళ్ళముందు అరుస్తోన్నట్టు అన్పిస్తోంది. కుక్కర్ విజిల్ వేయటంతో ఈ లోకంలోకొచ్చి పడ్డాను.

• • •

ఈ సంఘటన జరిగిన రెండోరోజున... మా ఆడపడుచు సుజాత దిగింది చేతిలో సూట్ కేసుతో, చంకలో పిల్లతో.

సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే ఇంచుమించుగా సమస్య నేను అనుభవిస్తున్నదే. సమస్త లోకాన్ని కప్పేసిన కట్నకాలుష్యం చిందించిన విష వాయువు కారణంగా ఆరిపోతోన్న మరో మహిళ జీవితం-

ఇపుడు మా అత్తయ్య ఆడపిల్ల తల్లి పాత్ర ధరించేసింది.

''ఎంత కష్టమొచ్చిందే సుజాతా, అయినా బైక్ కొంటామని మనం ఏదో మాటవరసకు అన్నాం. ఆ బోడి బైక్‌కోసం నిన్ను ఒంటరిగా పంపించేస్తాడూ? చంటిపిల్ల తల్లివనైనా జాలి లేకుండా... వాడు మనిషా, రాక్షసుడా''అంటూ శాపనార్థాలు లంకించుకొంది మా అత్తయ్య.

నాకెందుకో నవ్వొచ్చింది. పైకి నవ్వలేదు గానీ మా అత్తయ్య కనిపెట్టేసింది. నా కళ్ళల్లో కన్పిస్తున్న నవ్వు మెరుపును చూసి ఆమె కోపంతో ఊగిపోతూ మా ఆయన వైపు తిరిగి ''ఒరే శ్రీధరూ, చేత కాని చవటవు నువ్వే. అసలు నీ కట్నం డబ్బులు అపుడే వచ్చేసి వుంటే ఆ 'బైక్'కొనేసి నీ'బావ' మొహాన కొడుదుం. కానీ, మీ మావ ఇవ్వడే. ఇపుడు చూడు నీ చెల్లి బతుకు ఎలా రోడ్డున పడిందో...''

అప్పటివరకూ నిశ్శబ్దంగా వున్న శ్రీధర్‌లో చలనం వచ్చింది. అందరి దృష్టీ నామీదే వుంది. నేను తల వంచుకు నిలబడిపోయాను. శ్రీధర్ నన్ను ఉద్దేశించి అంటున్నాడు ''ఏమిటే, మూగిలా అలా తలొంచుకొని...'' ఇంకా ఏం అనేవాడో గానీ నా ఆడపడుచు సుజాత గొంతు మ్రోగింది. ''స్టాపిట్ అన్నయ్యా''అంటూ ఆశ్చర్యంగా తలెత్తి చూసాను నేను.

మా అత్తయ్య, ఆయన కళ్ళల్లోనూ అదే ఆశ్చర్యం.

''నా కారణంగా వొదినను ఏమీ అనటానికి నే వప్పుకోను. మీకు ఇష్టమైతే ఇక్కడ కొన్నాళ్ళుంటాను. లేదంటే...'' అంటూ పిల్లాణ్ణి ఓ వైపునుండి రెండో వైపుకు మార్చుకుని ''ఎలాగోలా బ్రతగ్గలను'' అంది. అందరం స్తబ్దులమైపోయాం.

★ ★ ★

ఆయన ఆఫీసుకు వెళ్ళింతర్వాత...

నాన్నకు 'లెటర్'రాయటం మొదలుపెట్టాను.

పూజ్యనీయులైన నాన్నగారికి,

అక్కడ మీరంతా క్షేమమని భావిస్తాను. ఇలా రాయటం భావ్యంకాదని తెలిసీ, మీరు బాధపడతారని తెలిసీ రాస్తున్నాను. నా పెళ్ళిలో మనం మీ అల్లుడుగారికి ఇవ్వాల్సిన బేలన్సు సొమ్ము వీలైనంత త్వరలో ఏర్పాటుచేయండి...

మీరు ఆ ఏర్పాటు ఎంత వేగిరం చేస్తే అంత వేగిరం ఇద్దరు ఆడపిల్లల కాపురాలను నిలబెట్టిన వారౌతారు. ఒకరు నేను, మరొకరు నా ఆడపడుచు సుజాత...

ఇంతలో వెనుక ఏదో కదిలినట్టు అన్పించడంతో వెనక్కి తిరిగాను. సుజాత... ఎంత సేపయిందో వెనక్కి వచ్చి నిలబడి అప్రయత్నంగా లెటర్ దాచే ప్రయత్నం చేసింది నా చెయ్యి. ''ఎందుకు వదినా దాస్తావు, నేను నువు రాసిన ప్రతి అక్షరం చదివాను''అంది.

''అది కాదు...''అంటూ నసిగాను.

''ఎంతవరకూ చదువుకున్నావ్ వదినా?''అని అడిగింది సుజాత నన్ను.

''బిఎస్సీ'' అన్నాను అసలామె ఎందుకలా అడిగిందో అర్థంకాక.

''మరి నువు కూడా ఏమిటిది వదినా, ఏ చదువూ లేని దానిలా...''

"అంత ఇంగిత జ్ఞానమే వుంటే పెళ్ళై పోయి రెండు సంవత్సరాలై పోతున్నా, ఇవ్వాల్సిన ఆ ఏభైవేలూ ఎపుడో మన మొహాన కొట్టేవాడు... వచ్చినపుడల్లా ఏవో కాకమ్మ కథలూ, కాని కష్టాలూ చెప్పేసి వెళ్ళిపోతాడు..."

"... ... ..." నేనేం మాట్లాడలేదు.

తనే అంది "మీ నాన్నగారికి డబ్బుకావాలని వుత్తరం రాస్తావు. ఆయన నానా ఇబ్బందులూ పడి, వాళ్ళకాళ్ళూ వీళ్ళకాళ్ళూ పట్టుకొని తల తాకట్టుపెట్టి 'డబ్బు'తెస్తారు. అది నాకిస్తారు. నేను దాన్ని తీసుకుని వెళ్ళి నా భర్త చేతిలో పెడతాను. ప్రస్తుతానికి సమస్య సెటిలౌతుంది." ఆమె కాసేపు ఆగి నేను వింటున్నానా, లేదా అని చూసి తిరిగి అంది.

"రేపు ఆయనగారికి వేరే ఏదో కొనుక్కోవాలని వుంటుంది. నన్ను మళ్ళీ పుట్టింటికి పంపేస్తాడు. నేను మీ అమ్మా అన్నల సాయంతో నిన్ను పుట్టింటికి పంపిస్తాను. మీ నాన్నగారికి రంపపుకోత మళ్ళీ... ఎన్నాళ్ళిలా?"సుజాత మాట్లాడుతూ వుంటే ఆ అమ్మాయిలో నాకు ఏదో కొత్తదనం కన్పిస్తోంది, కళ్ళల్లో నిర్భయత్వం వుంది. హృదయంలోని బాధను బయటకు కన్పించనీయటంలేదు. పెళ్ళికి ముందు లేని హుందాతనం ఏదో ఇపుడామెలో వుంది. బహుశా పెళ్ళైన తర్వాత ఆమెకు జీవితం నేర్పిన పాఠాలు ఆమెనలా తయారుచేసాయేమో. ఇంతలో మా అత్తయ్య రంగప్రవేశం చేసింది.

"అలా అంటావేమిటే, అక్కడ్నించి మనకు అవి రావల్సిన వేగా"

"ఎందుకివ్వాలమ్మా, వొదినా వాళ్ళ నాన్నగారికి క్రిందటి జన్మలో ఏమైనా అప్పిచ్చావా?"

"అదేమిటే సుజాతా, వెర్రిదాన్లా మాట్లాడతావ్... మీ వదిన తెచ్చే డబ్బులతో నీ కాపరం సుఖంగా..."

అపుడు అరిచింది సుజాత 'అమ్మా'అంటూ. ఆ కేకలో వేల సంవత్సరాలుగా నలిగిపోతున్న ఆడదాని వేదన ఉంది.

"మనది కాని సొమ్మును, మన కష్టం శ్రమా ఏదీ చెయ్యకుండా కేవలం మగాడుగా పుట్టటంవల్ల వచ్చిన ఆ 'కట్నం'అనే సొమ్మును మరీ ఇంత నిస్సిగ్గుగా, నిర్లజ్జగా... అదేదో జన్మహక్కైనట్టుగా దబాయించి అడగటం...సారీ, అడుక్కోవటం సిగ్గుగా అన్పించదా అమ్మా."

"నీ కొడుక్కి కట్నం తీస్కున్నావు కాబట్టి, కూతురైన నాకు కట్నం ఇచ్చావు. అదే విధంగా కట్నం బేలన్సుల కోసం పీడన. నీ కొడుకు ఒక ఇంటి కూతుర్ని, ఆ ఇంటి అల్లుడు నీ కూతుర్ని ఇలా ఏడ్పిస్తూనే... పీడిస్తూనే... చంపేస్తూనే వుంటారు" ఆయాసంతో వగరుస్తూ ఆగింది సుజాత. తల్లివైపు చూస్తూ అంది. "ఉద్యోగం చేస్తూ నెల నెలా నా అవసరాలకు కూడా ఆ సొమ్మును ఉంచుకోకుండా ఆయన చేతిలో పోస్తూ... తిరిగి తిరిగి అతని దయాధర్మభిక్షను ఆశిస్తూ- దానికి మా ఇద్దరిమధ్యా 'బెటర్ అండర్‌స్టాండింగ్స్'ఉన్నాయి అని సరిపెట్టుకొని- మూడేళ్ళ కాపరం చేసి- అతనికంటె సంసారంలో ఒక మెట్టు పైనే వుండి- నవమాసాలు అతని వంశాంకురాన్ని మోసాను కదా ఆ పనిని అతను చేయలేడు కదా అందుకే అతనికంటే నేను పై మెట్టులో వున్నానన్నాను"... ఊపిరి పీల్చుకోటానికి ఆగింది సుజాత.

"ఊరుకో సుజాతా, తర్వాత మాట్లాడుకోవచ్చు..." అన్నాను నేను కాస్త కంగారుగా.

"ఎపుడు వదినా, డబ్బు సర్దుబాటు చెయ్యలేక మీ నాన్నగారు ఏ నూతిలోనో పడి ఆత్మహత్య చేసుకొన్నాకనా".



"నీ కొడుక్కి కట్నం తీస్కున్నావు కాబట్టి, కూతురైన నాకు కట్నం ఇచ్చావు. అదే విధంగా కట్నం బేలన్సుల కోసం పీడన. నీ కొడుకు ఒక ఇంటి కూతుర్ని, ఆ ఇంటి అల్లుడు నీ కూతుర్ని ఇలా ఏడ్పిస్తూనే... పీడిస్తూనే... చంపేస్తూనే వుంటారు"

"ఏమిటా ముదనష్టపు మాటలూ"అంది మా అత్తయ్య. నవ్వింది సుజాత.

"అతను ఏభైవేలు సర్దటానికి పడే అగచాట్లవల్ల వెంటనే ఆత్మహత్య చేసుకోవచ్చు. లేకపోతే అది తీర్చటానికి పడే బాధలవల్ల మానసికంగా కృంగిపోయి తెలీని రోగంతో చనిపోవచ్చు."

ఇదంతా వింటోన్న మా ఆయన శ్రీధర్ చిరాగ్గా అన్నారు. "అయితే నువ్వేమంటావు" సుజాతవైపు చూస్తూ అన్నారాయన.

"ఓరేయ్ శ్రీధర్ అన్నయ్యా, ఇంత చెప్పినా నువ్వలా అడుగుతున్నావంటే నీ మనసులో మీ మావగారివ్వాల్సిన ఏభైవేలు మీద ఆశ వుందనేగా" అంది సుజాత.

"మరి మీ వారికి బైక్ కొనద్దూ"అన్నాడు లాజిగ్గా శ్రీధర్, అదే మా ఆయన తన చెల్లెలితో.

"నువు సంపాదించింది ఇవ్వు. లేదా ఇవ్వనని చెప్పు. అంతేగానీ ఇంకో శాల్తీ దగ్గర్నుంచి లాక్కొచ్చి... ఛీ, ఛీ సిగ్గుపడాలిరా"అంది సుజాత.

"మీ ఆయనకే చెప్పాల్సింది ఈ మాటలన్నీ" చిరాగ్గా అన్నాడు శ్రీధర్.

"చెప్పే వచ్చేసేను. ఓరి సిగ్గులేని మగడా! బైక్‌కోసం పుట్టింటికి ఫో అని నన్ను తరిమేసి భయపెడ్తున్నాననుకొంటున్నావేమో. నాకు చాలా ఆనందంగా వుంది. డబ్బుకే తప్ప మనసుకు విలువివ్వని నీలాంటి వాడితో వుండేకంటే- అని చెప్పే వచ్చేసాను."

"ఇంత మాత్రానికేనా?" అయినా ఆడపిల్లన్నాక... " కూతురితో మా అత్తయ్య ఏదో చెప్పబోతూ వుంటే సుజాత అంది. "అమ్మా, వద్దమ్మా... ఆ మాటలే ఇంతవరకూ నన్ను నోరెత్తనీకుండా చేసాయి. క్యాంటీన్లో టిఫిను తినాల్సి వచ్చి ఐదు రూపాయలు ఖర్చుచేస్తే లెక్క చెప్పాల్సిన దగ్గర్నుండి... ఆఫీసులో ఏ మగాడి ప్రవర్తన ఎలా వుందో ఎప్పటికప్పుడు ఎంక్వైరీ చేసి ఈరోజు ఇలా అన్నాడట వాడు... అలా కామెంట్ చేసాడట అనే డిటెక్షన్‌లను భరించి విసుగెత్తి పోయానమ్మా.."

శ్రీధర్ విస్తుబోయి చూస్తున్నాడు.

"మగాడిననే అహంకారంతో పెట్రేగిపోవటం... జులుం చేయటం అన్నీ భరించాను చివరాఖరున ఈ పిల్లకు తండ్రిని నేనేనా? అని వాడన్నపుడు..." సుజాత వెక్కివెక్కి ఏడవసాగింది.

మా అత్తయ్య గబుక్కున కదిలి హత్తుకోబోయింది. సుజాత వెంటనే తేరుకుని కళ్ళు తుడుచుకొంటూ "నేను నన్ను పోషించుకోగలను. నా బిడ్డను చూసుకోగలను. ఏదో కసి... భయంకరమైన కసి... మూలన పెట్టి తన్నిన పిల్లి ఇక తప్పదని తిరుగుబాటు చేసినప్పటి కసి ఆ కళ్ళల్లో...

⁂

సుజాత మాతోనే వుంటోంది.

శ్రీధర్‌గానీ, మా అత్తగారుగానీ ఏరోజూ నా కట్నం ఊసెత్తలేదు.

నాకింత చేసిన సుజాత కాపురాన్ని చక్కదిద్దాల్సిన బాధ్యత నాపైన వుంది. శ్రీధర్ సహకారంతో ఆర్నెల్లుగా నేను ఫోన్లద్వారా, ఉత్తరాల ద్వారా సుజాత భర్తను మార్చగలిగానని అతను ఆరోజు ఇంటికి వచ్చినపుడు అర్థమైంది.

సమస్య భార్యాభర్తలది, వాళ్ళిద్దర్నీ మాట్లాడుకోమన్నాము. మా అత్తయ్యగారు గానీ, మా ఆయనగారు గానీ, నేను గానీ ఎవ్వరం వెళ్ళలేదు.

సంభాషణ ఆర్గ్యుమెంటు కాలేదు. ఓ గంటసేపు మాట్లాడుకొన్నాక- ఇద్దరూ నవ్వుతూ గదిలోంచి బయటకొచ్చారు. అతని చేతిలో వాళ్ళ పాప వుంది.

సుజాత వంటగదిలోకొస్తూ అంది "భలే దానివి వదినా. మంచి భేటీ ఏర్పాటుచేసావ్. ఎపుడూ ఇద్దరం కై, కై'మంటూ అరుచుకోవటమే గానీ, కూర్చుని మాట్లాడుకోటం జరగలేదు. పైగా ఆయనకు నీలి చిత్రాలు చూసే అలవాటు టీనేజ్‌లో అయిందట. ఇక ఆ దృష్టి అనుమానించటం అనే జబ్బును మనసులో పెంచేలా చేసింది. పెళ్ళైన ఇన్నాళ్ళకు ఒకళ్ళకోసం ఒకరం తెలుసుకోటం జరిగింది" అంది సుజాత మనస్ఫూర్తిగా నన్ను అభినందిస్తూ.

మనుషులు విడిపోయినా, దేశాలు విడిపోయినా పరస్పరం తెలుసుకోకపోవటంవల్ల జరిగేదే. అర్థం చేసుకోవటం అనేది జరిగితే... లోకాస్సమస్తా సుఖినోభవంతు... ★




